క్లుప్తంగా

ఆశావర్కర్ల చేయూత



నగదు అందజేస్తున్న ఆశావర్కర్లు

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆశావర్కర్ మోదుగు సులోచన కుటుంబానికి జిల్లాలోని ఆశావర్కర్లు రూ.18,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు శుక్రవారం సులోచన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్, వైరా, తల్లాడ మండలాల ఆశావర్కర్ల సంఘం నాయకురాళ్లు రమణ, నాగమణి, శశిరేఖ, జ్యోతి, శైలజ, రాణి, కృష్ణకుమారి, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

ఇళ్ల పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న నర్సింహ

సత్తుపల్లిటౌన్: ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కోంద్రు నర్సింహ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వార్డుల్లో వన మహోత్సవానికి మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. పట్టణంలోని 4, 12, 21 వార్డులలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటేషన్‌ను పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ మైసా శ్రీనివాస్, ఏఈ సురేష్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామశాఖల నియామకం

కల్లూరురూరల్: మండలంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కార్యవర్గాల నియామకం ప్రారంభమైంది. పెద్దకోరుకొండిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకుడు మాదిరాజు అన్నంరాజు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా వేమిరెడ్డి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి రాజు, ప్రధాన కార్యదర్శులుగా తోటపల్లి విష్ణుమూర్తి, బండి శ్రీనివాసరావు, మాచర్ల గోపాల్‌రావు, షేక్ జాన్, కార్యవర్గ సభ్యులుగా దీవెన రామారావు, కూసుమరాజు మురళీ, వేముల శ్రీనివాసరావు, తడికమ్మల రాధాకృష్ణ, బీరెల్లి రాములు ఎంపికయ్యారు. లింగాల అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మేకల సురేష్‌లను ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరపల్లి మంగపతి, మద్దినేని లోకేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, మద్దినేని శ్రీను, దేవరపల్లి గోపయ్య, మట్టూరి రామారావు, పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ



బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ముదిగొండ: మండలపరిధిలోని పమ్మి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్సిళ్లను ఎంఈఓ రమణయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది పాఠశాల ఉపాధ్యాయులు పి.సురేష్ విద్యార్థులకు వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు జీవీ.రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధిక, ఏలూరి హనుమంతరావు, వడ్డె వెంకటనారాయణ, రమేష్, తదితరులు

కళాశాల మరమ్మతులకు రూ.18 లక్షలు

ఏన్కూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరమ్మతులకు రూ.18 లక్షల నిధులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సింహాచలం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నిధులతో సైన్స్ ప్రయోగ పరికరాలు మరుగుదొడ్లు, కొత్త, పాత భవనానికి మరమ్మతులు, పాత భవనం వైరింగ్, తదితర పనులను చేయడానికి సమావేశం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీఎస్ నారాయణ, విద్యార్థులు తల్లిదండ్రులు, డ్వాక్రా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ముదిగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి అన్నారు. ముదిగొండలో శుక్రవారం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ హరిప్రసాద్, కార్యదర్శి వెంకట్, నాయకులు ఎర్ర వెంకన్న, సిల్వరాజు, మల్లయ్య, ధర్మ పాల్గొన్నారు.

సిగ్నల్ లెస్ జర్నీ..!



పనిచేయని సిగ్నళ్లు.. దూసుకుపోతున్న వాహనాలు

- పద్మవ్యూహంగా మారిన సత్తుపల్లి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనాలు (ఇన్‌సెట్) పనిచేయని సిగ్నల్

సత్తుపల్లిటౌన్: ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయకపోవడంతో ఇష్టారీతిన వాహనాలు నడపటం.. మితిమీరిన వేగం.. పద్మవ్యూహంలా మారిన ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి పట్టణంలోని బస్టాండ్ రింగ్‌సెంటర్, కాకర్లపల్లి రోడ్ సెంటర్, బస్టాండ్ ఇన్‌గేట్, వేంసూరురోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిగ్నళ్లు మొరాయించటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా నడపటంతో రింగ్‌సెంటర్‌లో రోడ్డు దాటాలంటే గందరగోళానికి గురికావాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టు తప్పితే..

రింగ్‌సెంటర్‌లోని జాతీయ రహదారి ఎత్తుపల్లాలతో ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం ద్విచక్ర వాహనాలు పట్టుతప్పినా అంతే సంగతులు. చాలాకాలంగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. దీనికి తోడు రోడ్లపైనే భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. తోపుడు బండ్లతో రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండటంతో రహదారులు కుంచించుకుపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ నియంత్రణలోకి రాని పరిస్థితి నెలకొంటోంది.

నియంత్రణ లేని వేగం

పట్టణంలో వాహనాల వేగానికి నియంత్రణ కరువైంది. కూడళ్ల వద్ద పాదచారులు, సైకిలిస్టులు, వాహనదారులు రోడ్డు దాటే ప్రాంతాలలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రింగ్‌సెంటర్, పాతసెంటర్ ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవటంతో వాహనాల వేగాన్ని నియంత్రించలేక పోతున్నారు. దీంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

విరిగిపోయిన సిగ్నల్ స్తంభాలు



వేంసూరు రోడ్డులో ధ్వంసమైన సిగ్నల్ దిమ్మె

రింగ్‌సెంటర్ దిమ్మె వద్ద ఉన్న వేంసూరు రోడ్డు ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో కొద్దిరోజుల క్రితం అదికాస్తా విరిగిపోయింది. పాతసెంటర్‌లోని సిగ్నల్స్ స్తంభాలు సైతం ఇదే రీతిన భారీ వాహనాలు తగిలి పడిపోయాయి. ఇలా సిగ్నల్ లైట్లు మొరాయించి నెలరోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగంలో చలనం కలగటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సిగ్నళ్లు పునరుద్ధరించాలి..



బస్టాండ్ సెంటర్, పాతసెంటర్‌లో సిగ్నళ్లు లేకపోవటం వల్ల చాలా ఇబ్బంది ఏర్పడుతుంది. సిగ్నళ్లు ఉంటే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. వాహనాలు ఎదురుపడినప్పుడు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లే పరిస్థితి ఉండటం లేదు. సిగ్నల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలి. – కె.రమేష్, సత్తుపల్లి

అందుబాటులోకి తెస్తాం..



సత్తుపల్లి పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులతో చర్చించాం. త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను అందుబాటులోకి తీసుకొచ్చి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – టి.శ్రీహరి, సీఐ, సత్తుపల్లి

ఇళ్ల పంపిణీలో అవకతవకలపై విచారించాలి



మధిర: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఎర్రుపాలెంలో..

మధిర: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంపాడు పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్తులు ముట్టడించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ... గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, నిరుపేదలకు ఇళ్లు ఎంపిక చేయలేదని విమర్శించారు. గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయకుండా ఇందిరమ్మ కమిటీ నాయకులు చెప్పినట్లుగా లబ్ధిదారులను ఎంపిక చేయడం వల్ల అర్హులైన వారికి ఇల్లు మంజూరు కాలేదన్నారు బాజినేని వెంకట నరసయ్య, అంగడాల అమరయ్య, లాలు, వెంకటేశ్వరరావు, వజ్రమ్మ, మీరా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ నాయకులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌లు మాట్లాడుతూ... నిరుపేదలైన అర్హులకు మొండిచేయి చూపి అనర్హులకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌కి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు, హనుమంతరావు, వెంకటనారాయణరెడ్డి, వీరాంజనేయులు, శ్రీహరినారాయణ, వెంకటనారాయణరెడ్డి, భాస్కరరావు, సీతారెడ్డి, వెంకటరెడ్డి, జానీ, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం 50 స్తంభాలను ఏర్పాటు చేశారు. ఏఈ ఉమామహేశ్వరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, బస్వయ్య, కంభం వీరభద్రం, వెంకటేశ్వర్లు, శాంతయ్య, సిబ్బంది రమేష్, రాజు ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన విద్యార్థులు

కారేపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫిజిక్స్ వాలా కోచింగ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ విజయకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీరోజు ఇంటర్మీడియట్ తరగతులతో పాటు, కాంపిటేటివ్ ఎంట్రెన్స్‌లకు సంబంధించిన కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

కేసు నమోదు

చింతకాని: మండలపరిధిలోని గాంధీనగర్ కాలనీ గ్రామానికి చెందిన సలీంద్ర వీరబాబు అను వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సలీంద్ర ఉపేందర్ భార్య గురించి వీరబాబు అసభ్యంగా చెబుతున్నాడని ఇదేంటని ప్రశ్నించిన ఉపేందర్‌తో వీరబాబు గొడవపడి కర్రతో కొట్టి చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్ మీరా వీరబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిధులు మంజూరు

చింతకాని: మండలంలోని పలు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల అభివృద్ధికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 4 కోట్లు మంజూరు చేశారు. మత్కేపల్లి గ్రామానికి రూ.36 లక్షలు, తిమ్మినేనిపాలెం రూ.62 లక్షలు, నర్సింహాపురం రూ.18 లక్షలు, నాగిలిగొండ రూ.85 లక్షలు, చింతకానికి రూ.44 లక్షలు, పాతర్లపాడు రూ.85 లక్షలు, కోమట్లగూడెంకు రూ.70 లక్షలను మంజూరయ్యాయి. ఈ సందర్భంగా భట్టికి కాంగ్రెస్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని వెంకటసాయినగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం పట్టణానికి చెందిన భూపతి సుమన్ బైక్‌పై ఇల్లెందు వైపు వెళ్తుండగా భాగ్యనగర్ తండాకు చెందిన బాణోత్ వస్రాం సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో సుమన్‌కు తీవ్రగాయాలవ్వగా, వస్రాంకు స్వల్పగాయాలయ్యాయి. ఇరువురిని స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలలో బోనాలు..



బోనాలతో విద్యార్థినులు, యాజమాన్యం

మధిర: ఆషాఢమాసం సందర్భంగా భరత్ స్కూల్‌లో శుక్రవారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శీలం విద్యాలత వెంకటరెడ్డి బోనాల విశిష్టతను వివరించారు. ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, డీన్ రవీంద్రారెడ్డి, స్రవంతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా..



పల్టీ కొట్టిన వరి పొట్టు లారీ

కొణిజర్ల: వరిపొట్టు లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి మండలకేంద్రంలో శుక్రవారం పల్టీ కొట్టింది. ఖమ్మం నుంచి వైరా ఇటుక బట్టీలకు పొట్టు తీసుకెళ్తున్న లారీ కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో పొట్టంతా నేల పాలయ్యింది

నేడు వైరాలో 'మహిళాశక్తి' సంబురాలు

వైరా/కొణిజర్ల/ఏన్కూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరా మహిళాశక్తి సంబురాలు శనివారం వైరా వ్యవసాయ యార్డ్‌లో జరగనున్నాయి. ఈ మేరకు డీఆర్‌డీఓ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రూ.4,83,026 వడ్డీ లేని రుణాలు, రూ.60లక్షల ప్రమాద బీమా, రూ.42,27,480 మేరా రుణాలపై వడ్డీ చెక్కులు పంపిణీ చేస్తారు. అలాగే, నియోజకవర్గంలో 4,300 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాగా, కొందరికి వైరాలో, ఇంకొందరికి గ్రామాల్లో డీలర్ల ద్వారా పంపిణీ పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. కాగా, కొణిజర్ల మండలంలో వెయ్యికి పైగా, ఏన్కూరు మండలానికి 601 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని తహసీల్దార్లు నారపోగు అరుణ, సీహెచ్.శేషగిరిరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అందులో కొందరికి వైరాలో శనివారం కార్డుల అందించనుండగా, మిగతా వారు గ్రామాల్లో డీలర్ల వద్ద తీసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా నేడు(శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తల్లాడ విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముదిగొండ: మండలంలోని ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైన్లు, మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదే..

- ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. సత్తుపల్లిలోని జ్యోతినిలయం పాఠశాలలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదోతరగతి ఫలితాల్లో జిల్లాలోనే సత్తుపల్లి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన హెచ్‌ఎంలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో సస్యశ్యామలం



వేంసూరు: గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

వేంసూరు: గోదావరి, కృష్ణా జలాలతో పంటలు సమృద్ధిగా పండి నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. వేంసూరు మండలం కుంచపర్తి రెగ్యులేటర్ వద్ద గోదావరి జలాలకు శుక్రవారం ఆమె రైతులతో కలిసి పూజలు చేశాక మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయనంద్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, వెల్ది జగన్‌మోహన్‌రావు, గొర్ల సంజీవరెడ్డి, ఎండీ.పైజుద్దీన్, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, ఒగ్గు కరుణాకర్‌రెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలనే సంకల్పంతో..

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: ఇందిరమ్మ రాజ్యంలో పేదప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని, ప్రతీ నిరుపేదకు సొంతింటి కల నెరవేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మున్సిపాలిటీలోని 1, 4, 12 వ వార్డుల్లో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అమలుపరుస్తూ సుస్థిర పాలన అందజేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించాలన్నారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వేణు, నాయకులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, బోళ్ల గంగారావు, దార్న రాజశేఖర్, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, హౌసింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



మధిర: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర



ఎర్రుపాలెం: నారాయణపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ వంశీకృష్ణ

మధిర: ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ పంట లాభదాయకమని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. సిద్దినేనిగూడెం గ్రామంలో శుక్రవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆయిల్‌పాం మొక్కలను ఒకసారి నాటితే 30 ఏళ్ల వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కోతుల నుంచి, ప్రకృతి వైపరీత్యాల నుంచి హాని జరగకుండా ఉంటుందని, చీడపీడలు తక్కువగా ఆశించి, మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంట అన్నారు. అదే విధంగా నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఏఈవోలు జిష్ణు, నిఖిత పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ..

మండలంలోని మధిర, మడుపల్లి, నిధానపురం, సిద్దినేనిగూడెం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఏడీఏ విజయచంద్ర తనిఖీ చేశారు. ఎరువుల డీలర్ల స్టాక్ రిజిస్టర్, ఫార్మర్ సేల్, రిజిస్టర్, బిల్ బుక్, ఇన్వాయిస్‌లను పరిశీలించారు. ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురం, రాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు ఏఈవో కూరెళ్ల వంశీకృష్ణ అవగాహన కల్పించారు. ఆయిల్ పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీల్లోని సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. రాజుపాలెం సొసైటీ సీఈవో శివారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన


చింతకాని: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని హౌసింగ్ మండల ఏఈ సుప్రియ సూచించారు. మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి నిర్మాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సట్టు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రేణుక, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



స్థానికులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతకాని: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ అన్నారు. ఈ మేరకు మండలపరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి మందుల్ని పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి నిల్వ నీటిని తొలగించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణారావు, ఏఎన్‌ఎం సరళ, ఆశలు సునిత, కస్తూరి, ఉన్నారు.



గడ్డి మందు కొట్టిస్తున్న దృశ్యం

తల్లాడ: మండలంలోని నూతనకల్‌లో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. డ్రెయినేజీలో పెరిగిన గడ్డిని తొలగించారు. కల్యాణపు వెంకటయ్య, అడపా అనిల్ ఆధ్వర్యంలో రూ.10,000 అన్ని వీధుల్లో గడ్డి మందు కొట్టించారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని పమ్మి, సువర్ణాపురం, మాధాపురం గ్రామాల్లో ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ అరుణాదేవి తెలిపారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ మధుసూదన్‌రావు, వైద్య సిబ్బంది లత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

లైబ్రేరియన్ లేక వెలవెల..

- పదేళ్లగా లైబ్రేరియన్ నియామకంలో జాప్యం
- వారానికొకసారే వస్తున్న ఇన్‌చార్జ్
- మరోపక్క గ్రంథాలయానికి దారి లేక ఇక్కట్లు

కల్లూరు: కల్లూరులోని గ్రంథాలయం ఒకప్పుడు పాఠకులతో కళకళలాడేది. దిన, వార, మాస పత్రికలు, కాంపిటేటివ్ బుక్స్, నవలలు, కవితల పుస్తకాలు ఇలా రకరకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉండి నిత్యం ఉదయం, సాయంత్ర వేళల్లో యమ రద్దీగా ఉండేది. పదేళ్లకు పైగా రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడం, తల్లాడ నుంచి ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ వారంలో కేవలం బుధవారం మాత్రమే అందుబాటులో ఉండడం, సరైన దారి లేకపోవడంతో పాఠకుల సంఖ్య తగ్గిపోయింది. పోటీ పరీక్షలు రాసే నిరుద్యోగ అభ్యర్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడానికి కూడా వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం తల్లాడ మండలం లైబ్రేరియన్ కిషోర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ ప్రతీ బుధవారం కల్లూరు వస్తారు. గ్రంథాలయానికి పూర్వ వైభవం రావాలంటే రెగ్యులర్ లైబ్రేరియన్ అందుబాటులో ఉంటే పాఠకుల సంఖ్య క్రమేణా పెరిగే అవకాశం ఉంది.



దారి లేని గ్రంథాలయ భవనం

మున్సిపల్ కార్యాలయం బందయితే అంతే..

కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం వెనుక ఉన్న గ్రంథాలయం భవనానికి చుట్టూ ఎలాంటి దారి లేకపోవడంతో గ్రంథాలయానికి వచ్చేవారికి తీవ్ర అసౌకర్యంగా ఉంది. గతంలో మధిర రోడ్ నుంచి లైబ్రేరీ భవనానికి నేరుగా దారి ఉండేది, ప్రస్తుతం ఆ దారి మూసి వేయడంతో సమస్యగా మారింది. మున్సిపాలిటీ కార్యాలయం బందయితే ఆ రోజు లైబ్రేరీ ఉండదు. ఇప్పటికైనా అధికారులు రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించి, గ్రంథాలయానికి నేరుగా వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించాలి



కల్లూరు లైబ్రరీకి రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించాలి. రెగ్యులర్‌గా లైబ్రేరియన్ లేకపోవడంతో గ్రంథాలయం అన్ని రకాల పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఇబ్బంది అవుతుంది. దీనికి తోడు గ్రంథాలయానికి వెళ్లేందుకు సరైన రహదారి కూడా లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – గునుకుల ఈశ్వరరావు, కల్లూరు